

అంతర్జాతీయ పోటీలకు బిందుశ్రీ ఎంపిక


ఇసుకపట్ల బిందుశ్రీ

తాళ్లరేవు : బాల్ బ్యాడ్మింటన్‌లో భారత జట్టు తరపున అంతర్జాతీయ పోటీలకు మండలంలోని జార్జిపేటకు చెందిన ఇసుకపట్ల బిందుశ్రీ ఎంపికయింది. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో ఆయా జట్లకు సారథ్యం వహించిన బిందుశ్రీ ఇటీవల ఢిల్లీలో జరిగిన సెలక్షన్స్‌లో ప్రతిభ చాటి జాతీయ జట్టుకు ఎంపికయింది. వచ్చే ఏడాది మార్చిలో థాయిలాండ్‌లో మహిళా విభాగంలో భారత్ జట్టు తరపున ఆడనున్నట్లు బిందుశ్రీ తెలిపారు. అయితే ఈ క్రీడలలో పాల్గొనడానికి సుమారు రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని, పేద కుటుంబం నుంచి వచ్చిన తనకు అంత స్తోమత లేదని అన్నారు. దాత లు ముందుకు వచ్చి తన క్రీడా లక్ష్యానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మందకొడిగా రబీ సాగు..!

- ఆలస్యంగా పనులు
- 20 శాతం కూడా దాటని నాట్లు
- వెంటాడుతున్న సాగునీటి కష్టాలు
- ఆందోళనలో అన్నదాతలు


కాకినాడ రూరల్‌లో వరినాట్లు వేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

అనుకున్న షెడ్యూల్ ప్రకారం రబీ సాగు పనులు ముందుకు సాగడం లేదు. గత ఖరీఫ్‌లో మొంథా తుపానుతో పనులు ఆలస్యం అవ్వడంతో ఆ ప్రభావం రబీపై పడింది. దీంతో అన్నదాతలు రబీకి సాగునీటి కష్టాలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్ పంట చేతికందే చివరి దశలో తుపాను రావడంతో అన్నదాతలకు నష్టాన్ని మిగిల్చింది. దీంతో ఖరీఫ్ సీజన్‌లో అంచనాల మేరకు పంటలు సాగవ్వలేదు. ఈ నేపథ్యంలో కోటి ఆశలతో మళ్లీ రబీ సాగుకు సిద్ధమయ్యారు. ఇదిలా ఉండగా ఈ సీజన్‌లో వరి సాగు షెడ్యూల్ ప్రకారం జరుగుతుందని అన్నట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కలిసి వస్తుందని ఆశతో రైతులు ముందుకు సాగుతున్నారు. అయితే ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందరి రైతులకు సాగునీరు, ఎరువులు కొరత లేకుండా చూడాలి. ఎరువుల కొరతపై పూర్తిస్థాయిలో నియంత్రణ కలిగి ఉండాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఈ ఏడాది జిల్లాలో 1.77 లక్షల ఎకరాల్లో రైతులు రబీ సాగు జరగనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. బోర్లు, పిబిసి కెనాల్, ఏలేరు, తాండవ, పంపా, తిమ్మరాజు చెరువు సాగునీటి వ్యవస్థల ద్వారా ఈ విస్తీర్ణంలో పంటలు సాగవుతాయి. వ్యవసాయ శాఖ నిర్దేశించుకున్న లక్ష్యం, ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఈనెల డిసెంబర్ చివరికల్లా నాట్లు పూర్తి కావలసి ఉంది. అయితే ఏటా ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించడం దానికి అనుగుణంగా సాగు పనులు జరిగేలా చర్యలు తీసుకోకపోవడం వంటి అనేక కారణాల వలన అంతిమంగా అన్నదాతలు తీవ్రస్థాయిలో నష్టపోతున్నారు. సాగునీటి సలహా మండలి సమావేశంలో ఈ ఏడాది ఆయకట్టు అనుగుణంగా లక్ష్యాలను తీసుకున్నారు. అయితే సాగునీటి వ్యవస్థలో ఉన్న లోపాలతో రబీ సాగు ముందుకు కదలడం లేదు.

20 శాతం దాటని సాగు పనులు

డిసెంబర్ చివరి నాటికే నాట్లు పూర్తి చేయాలని అధికారుల లక్ష్యం. కానీ అందుకు విరుద్ధంగా సాగు పనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 20 శాతం కూడా రబీ నాట్లు పనులు పూర్తి కాలేదు. సుమారు 1500 ఎకరాల్లో నారు మడులు, 7 వేల ఎకరాలలో నాట్లు వేయగా దాదాపు 20 వేల ఎకరాల్లో ఎదజల్లు ద్వారా మాత్రమే ఇప్పటివరకు పనులు పూర్తయ్యాయి. మొత్తంగా సుమారు 28 వేల ఎకరాలలో మాత్రమే ఇప్పటి వరకు నాట్లు పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన విస్తీర్ణంలో పూర్తిస్థాయిలో పనులు అవ్వాలంటే వచ్చే నెలాఖరకు వరకు సమయం పట్టి అవకాశం కనిపిస్తోంది. మూడు నెలలు పంట కాలం కావడంతో మూడో పంటగా అపరాలు వేసే అవకాశాన్ని ఈ మేరకు కోల్పోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటి ఇబ్బందులు తప్పవా..?

ప్రస్తుతం నారుమడులను సిద్ధం చేసుకునే పనుల్లో పలుచోట్ల రైతులు బిజీగా ఉన్నారు. అయితే ఈ నెల ఒకటి నుంచే కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో చివరి ఆయకట్టు వరకు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి తదితర ప్రాంతాలకు ఏలేరు ద్వారా వంతులు వారీ విధానంలో సాగునీటిని అందివ్వాల్సివుంది. అయితే ప్రస్తుతం నారుమడుల వరకూ నీటిని విడుదల చేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ పిఠాపురం నియోజవర్గం శివారు ఆయకట్టు కావడంతో ఇక్కడకు పూర్తిస్థాయిలో నీరు లభ్యం కావడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. బోర్లు, ఇతర ప్రయివేటు సాగునీటి వనరుల ద్వారా నారు మడులను సిద్ధం చేసుకుంటున్నారు. గతంలో నిర్వహించిన కాలువల ఆధునికీకరణ పనులు అరకొరగానే వదిలేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఏలేరు ఆధునికీకరణ పనులు ముందుకు సాగడం లేదు. గతేడాది వరదలతో పడిన పలు గండ్లను అధికారులు నేటికీ పూడ్చలేదు. మొన్న వచ్చిన తుపాన్‌కు మరికొన్ని గండ్లు పడ్డాయి. దీంతో ఏలేరు ద్వారా సాగునీరు చివరి ఆయకట్టుకు నీరు చేరని పరిస్థితి కన్పిస్తోంది. మరో వైపు పిబిసిలోనూ సమస్యలు వెంటాడుతున్నాయి.

యూరియా పూర్తిస్థాయిలో అందేనా..?

గడచిన ఖరీఫ్‌లో ఎరువుల కోసం రైతులు పడరాని పాట్లు పడ్డారు. ముఖ్యంగా యూరియా కొరతను తీవ్రంగా ఎదుర్కొన్నారు. దీంతో పంటల దిగుబడిపై ప్రభావం చూపిందని పలువురు రైతులు తెలిపారు. ఈ నేపథ్యంలో రబీలో ఎరువుల కొరతను ఏ విధంగా అధిగమిస్తారు అన్నది అధికారుల ముందు ఉన్న ప్రశ్న. ముఖ్యంగా యూరియా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుతారా? లేదా? అనే ప్రశ్నలు రైతులను కలవర పెడుతున్నాయి. ఎకరానికి కేవలం ఒక బస్తా మాత్రమే ఇస్తామని అధికారులు చెప్పుకొస్తున్నారు. బ్లాక్‌లో అధిక ధరలకు యూరియా అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి రైతుల ఇబ్బందులను ఏ విధంగా పరిష్కరిస్తారో చూడాల్సి ఉంది.


సమావేశంలో జెసి అపూర్వభరత్‌తో కలిసి మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

భూసేకరణను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్ఒబి), రోడ్డు అండర్ బ్రిడ్జ్(ఆర్‌యుబి) నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి ఆర్ఒబి, ఆర్‌యుబిలకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియపై రెవెన్యూ, రోడ్డు భవనాలు, రైల్వే అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం పిఎం గతిశక్తి పథకం కింద రైల్వే లైన్ల మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా జిల్లా పరిధిలో వివిధ ప్రదేశాల్లో రైల్వే లైనులకు అవసరమైన ఆర్ఒబి, ఆర్‌యుబిలను నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రాథమిక దశలో వీటి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇందుకు రెవెన్యూ, సర్వే, రోడ్డు భవనాల శాఖల అధికారులు సంయుక్తగా సర్వే నిర్వహించి, భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రక్రియకు సంబంధించిన పనులు ఎప్పటికప్పుడు స్టేజ్ అప్డేషన్ జరిగేలా అధికారులు ప్రత్యేక కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, రోడ్డు భవనాల శాఖ ఎస్ఇ జి.కాంతు, ఇఇ నర్సయ్య, రైల్వే కన్సల్టెంట్ ప్రతినిధి ఉదయభాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాట్రావులపల్లి, రాజపూడి, మన్యంవారిపాలెం జడ్‌పి హైస్కూల్స్‌కు చెందిన 10 తరగతి విద్యార్థులకు దాతల సహకారంతో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను శనివారం ఆయా పాఠశాలల్లో మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో అందజేశారు. మన్యవారిపాలెం స్కూల్ విద్యార్థులకు అమరపల్లి శ్రీనివాసు, బొడ్డు బంగారురాజు, దమ్ము అప్పారావు, రాజపూడి విద్యార్థులకు సవితాల సత్యనారాయణ, కాట్రావులపల్లి విద్యార్థులకు ముసిరెడ్డి ఆంజనేయులు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.28 వేల విలువ చేసే స్టడీ మెటీరియల్ అందించినట్లు యుటిఎఫ్ మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు ముసిరెడ్డి ఆదినారాయణ, ముసిరెడ్డి నాగేశ్వరరావు, ముసిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని రాబోయే పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుంకర సీతారామయ్య, కంటే రామారావు, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవి.సాయిరాం, జిల్లా కౌన్సిలర్ వి.చంద్రశేఖర్, మండల కార్యదర్శులు బి.కోటేశ్వరరావు, ఎంబివికె.మధుకుమార్, డి.అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు, యువతను కాపాడుదాం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కాకినాడ

బావి భారత పౌరులైన విద్యార్థులను, యువకులను గంజాయి మహమ్మారి నుంచి కాపాడుకుందామని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి పిలుపునిచ్చారు. గంజాయి మహమ్మారిని తరిమికొడదాం అనే నినాదంతో యుటిఎఫ్ ప్రచురించిన కరపత్రాన్ని కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రవిచక్రవర్తి, జిల్లా అధ్యక్షులు సిహెచ్.సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి.నగేష్, జిల్లా కార్యదర్శులు టి.రామలక్ష్మి, సిహెచ్. ఆశీర్వాదం, పి.గిరిధర్ గోపాలరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకప్పుడు కొన్ని వయసుల వారికి, కొన్ని వ్యవస్థలకే పరిమితమైన మత్తు పదార్థాలు ప్రస్తుతం యువతను, విద్యార్థులను సైతం బానిసలగా చేస్తుందన్నారు. ముఖ్యంగా గంజాయి ప్రధాన పాత్ర పోషిస్తున్నదని, అభం శుభం తెలియని చిన్న పిల్లలు సైతం గంజాయికి బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సామాజిక స్పృహ కలిగిన సంఘమైన యుటిఎఫ్ భావి భారత పౌరులను గంజాయి మహమ్మారి నుంచి కాపాడడం కోసం రెండు లక్షల కరపత్రాలను ముద్రించి పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రవిచక్రవర్తి మాట్లాడుతూ యువత గంజాయి మత్తుకు బానిసై వినాశకర ధోరణల వైపు పయనిస్తోందని, దీనిని ప్రజలందరూ ముక్తకంఠంతో ఎదుర్కోవాలని తెలిపారు.

ఎపిఎన్‌జిఒ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం


ప్రమాణం చేస్తున్న ఎపి ఎన్‌జిఒ నూతన జిల్లా కార్యవర్గం

ప్రజాశక్తి - కాకినాడ

ఎపి ఎన్‌జిఒ జిల్లా కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. శనివారం స్థానిక ఎపిఎన్‌జిఒ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ జరిగింది. సంఘానికి సంబంధించి 17 పోస్టులకు 17 నామినేషన్లు దాఖలు కావడంతో వారందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చోడగిరి శ్రీనివాసరావు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా గుద్దటి రామ్మోహన్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా సరెళ్ల చంద్రరావు, కెవిఎన్‌వి.ప్రసాద్, పి.పాండురంగా రావు, ఎంఎన్.సత్యనారాయణ, ఆర్.జయకృష్ణ, మహిళా ఉపాధ్యక్షులుగా ఎస్‌వి.భారతి, కార్యదర్శిగా పిఎన్‌కెవివిఎస్. మూర్తిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వై.రామకృష్ణ, జాయింట్ సెక్రటరీలుగా బి.శ్రీనివాసరావు, ఎన్.వీరబాబు, టి.చార్లెస్‌పాల్, ఎస్ఎల్.పరిమళ్‌కుమార్, టి.వెంకటరమణ, మహిళా సెక్రటరీగా మహిళా జాయింట్ సెక్రటరీగా వి.విజయలక్ష్మి, కోశాధికారిగా వై.పద్మమీనాక్షి ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అపంతనం సంఘ ఉద్యోగుల సమక్షంలో పదవీ బాధ్యతలు చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యవర్గం పదవీకాలం మూడేళ్ల పాటు ఉంటుందని లేదా ఎన్నికలు జరిగేంత వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంఎల్‌ఎ వనమాడి వెంకటేశ్వరరావు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గం ఉద్యోగులందరూ సిఎం చంద్రబాబు చేస్తున్న రాష్ట్ర అభివీద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి ఎన్‌వి.రామారావు, పర్యవేక్షణ అధికారిగా ఎ.రంజిత్‌కుమార్ నాయుడు వ్యవహరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా మాజీ అధ్యక్షులు ఆచంట రామారాయుడు, బూరిగ ఆశీర్వాదం, రాష్ట్ర ట్రెజరీస్ అకౌంట్స్ ఉద్యోగుల అధ్యక్షులు పాము శ్రీనివాస్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ కార్యదర్శి వేపకాయల వెంకటకృష్ణ, జిల్లా విద్యాశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మొండి రవికుమార్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం ఇన్‌ఛార్జ్ అధ్యక్షుడు కడలి శేషగిరిరావు, రాష్ట్ర పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్‌వివి.రమేష్, కూటమి నాయకులు కటకంశెట్టి సత్యప్రభాకర్, మట్టా ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలుని శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ప్రకాష్

ప్రజాశక్తి - పెద్దాపురం

సామర్లకోట బలుసుల పేటకు చెందిన పేరూరి సాయికుమార్‌కు అవసరమైన శస్త్ర చికిత్స నిమిత్తం స్థానిక ప్రతిభ విద్యానికేతన్ విద్యార్థులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. శనివారం పాఠశాలలో జరిగిన అసెంబ్లీలో ఆ కుటుంబానికి రెండు నెలలకు సరిపడే బియ్యం, నిత్యావసర సరుకులతోపాటు, విద్యార్థులు సేకరించిన రూ.80,300 నగదును అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎస్‌వివిజి.ప్రకాష్, ప్రిన్సిపల్ టి.అరుణ, వైస్ ప్రిన్సిపల్ ఎస్.దుర్గాభవానీ మాట్లాడుతూ బాలునికి సంబంధించి మీడియాలో వచ్చిన కథనాలకు స్పందించిన తమ విద్యా సంస్థ విద్యార్థులు వారి వారి తల్లిదండ్రుల నుంచి ఈ ఆర్థిక సాయాన్ని సమకూర్చారని అన్నారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం


బాధితురాలికి సాయమందిస్తున్న గోపిశ్రీలక్ష్మీ

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడిలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మోర్తా రాణి కుటుంబాన్ని ప్రయివేటు వైద్యులు గంట గోపిశ్రీలక్ష్మి, టిడిపి యువ నాయకులు ఇటంశెట్టి అశోక్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి ఇద్దరూ కలిసి రూ.7,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఇటీవల రాణి భర్త అనారోగ్యంతో మృతి చెందారని, ఇద్దరు కుమారులు, కుమార్తెలను తన రెక్కల కష్టంతో సాకుతున్న ఆమెను ప్రభుత్వంతోపాటు, దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని వారు కోరారు.

ముగిసిన గెస్ట్ లెక్చర్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 'మోడర్న్ వెబ్ డెవలప్‌మెంట్ యూజింగ్ వర్డ్‌ప్రెస్ అండ్ ఎఐ' అనే అంశంపై నిర్వహించిన గెస్ట్ లెక్చర్ శనివారం ముగిసింది. గెస్ట్ లెక్చర్ కార్యక్రమానికి అబైడ్ క్రియేటివ్స్ సంస్థ వ్యవస్థాపకులు, డైరెక్టర్ సట్టాల వంశీ భాస్కర్ ఆధునిక వెబ్ డెవలప్‌మెంట్‌లో వర్డ్‌ప్రెస్ ప్రాముఖ్యత, ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో వర్డ్‌ప్రెస్‌కు ఉన్న డిమాండ్, వెబ్ డెవలప్‌మెంట్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్.రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎ.రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ మాకినీడి రాజాబాబు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాక్ పోలింగ్


మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు జడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులతో అసెంబ్లీ మాక్ పోలింగ్ నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఓటర్లుగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు వి.శ్రీనివాస్, బి.శివప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య విధానంలో పాలకులను ఏ విధంగా ఎన్నుకుంటారనేది విద్యార్థులకు తెలిసేందుకే ఈ మాక్ పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ మాక్ పోలింగ్‌ను పాఠశాల హెచ్‌ఎం సిహెచ్.ప్రకాష్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసి ఛైర్మన్ సిహెచ్.ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


స్క్రబ్ టైఫస్ పట్ల ఆందోళన వద్దు


డాక్టర్ సుష్మ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

స్క్రబ్ టైఫస్ వైరస్ వ్యాధి పట్ల ఎటువంటి ఆందోళన చెందవద్దని స్థానిక పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ సిహెచ్.సుష్మ శనివారం తెలిపారు. మండలంలో ఇటీవల అమీనాబాద్, ఉప్పాడ అనంతలక్ష్మి కాలనీకి చెందిన ఇద్దరికి ఈ వ్యాధి వచ్చిందని, ప్రస్తుతం వారిద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు. ఈ వైరస్ సోకినవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, భయపడ వలసిన అవసరం లేదని అన్నారు. ఎవరికైనా జ్వరం వస్తే స్థానిక ఆర్‌ఎంపిల వద్ద కాకుండా ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని సూచించారు. పాజిటివ్ కేసులు వచ్చిన ప్రాంతాలలో వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు.

కార్టూ'నిజం'



ఘనంగా ఎస్ఎఫ్ఐ కల్చరల్ ఫెస్ట్



కల్చరల్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న గంగాసూరిబాబు

ప్రజాశక్తి - కాకినాడ

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేద్కర్ భవనంలో కల్చరల్ ఫెస్ట్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.లోవరాజు, ఎం.గంగాసూరిబాబు మాట్లాడారు. విద్యార్థులలో పెరుగుతున్న అసాంఘిక భావాలను, ఒత్తిడిని తగ్గించడానికి, విద్యార్థులకు సామాజిక బాధ్యత పెంచడానికి ఎస్ఎఫ్ఐ ఒక బాధ్యతగా ఈ కల్చరల్ ఫెస్ట్ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుతం సమాజంలో ఉన్న దుష్ప్రభావాల నుంచి విద్యార్థులను దూరం చేయాలని, విద్యార్థులను మంచి మార్గం వైపు నడిపేల, విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసే లక్ష్యంతో కల్చరల్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల నుంచి 8 నెలల వయసున్న పిల్లల నుంచి 20 సంవత్సరాల వయసున్న విద్యార్థుల వరకూ పాల్గొన్నారు. క్లాసికల్ డాన్స్‌లు, ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పరిణామాలపై వ్యాసరచన, వకృత్వం, చిత్రలేఖనం, చెస్, రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్ వంటి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆదివారం కూడా ఈ ఫెస్ట్ కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా, నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


భరతనాట్యం చేస్తున్న విద్యార్థులు


వివిధ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సత్యసాయిలో ఉత్సాహంగా క్రియేటివ్ ఫెస్ట్

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక శ్రీసత్యసాయి హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన క్రియేటివ్ ఫెస్ట్ ఉత్సాహంగా సాగింది. విద్యార్థులు సృజనాత్మకతతో పలు ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. విద్యార్థులలోని దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఈ వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ పట్టా ఆదినారాయణ వర్మ తెలిపారు. 2వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న విద్యార్థులు సైన్సు, సోషల్, మ్యాథమెటిక్స్ విభాగాలలో సమారు 100 ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టుల నిర్వహణకు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు సహకారం మరువలేనిదని పాఠశాల కరస్పాండెంట్ వర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్రాంతిని సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి


ఎస్ఐ శివనాగబాబు

ప్రజాశక్తి - గండేపల్లి

సంక్రాంతి పండుగను ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా ప్రజలందరూ సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని ఎస్ఐ యువి.శివనాగబాబు సూచించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మండలంలో కోడి పందాలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యక్రమాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో జాతరలు, రికార్డింగ్ డాన్సులు, అశ్లీల నృత్యాలు నిర్వహించరాదన్నారు. పండుగ నెలలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతాయని, అందువల్ల ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు.

బాల్య వివాహ అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చంద్రమాంపల్లి జడ్‌పి హైస్కూల్‌లో బాల్య వివాహ అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి హైస్కూల్ హెచ్‌ఎం శ్రీలక్ష్మి అధ్యక్షత వహించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, ప్యానల్ లీగల్ అడ్వకేట్ కెఎంఎల్.గణేష్ మాట్లాడారు. అనంతరం బాల్యవివాహ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

నేరాలు ఘోరాలు



భలభద్రపురంలో నిర్వహిస్తున్న కోడి పందేలు

ఫ్లడ్ లైట్ల వెలుగులో కోడి పందేలు
పోలీసుల దాడి, ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

20 రోజులకు ముందే జగ్గంపేట నియోజకవర్గంలో సంక్రాంతి సందడి మొదలైంది. సంక్రాంతి మూడు రోజులు కోడి పందేలు నిర్వహించడం పరిపాటి. అయితే మండలంలోని భలభద్రపురం గ్రామ పరిధిలోని పామాయిల్ తోటలో శుక్రవారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుతురులో జోరుగా కోడి పందాలను నిర్వహించారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఈ పందేలు జరిగినట్లు సమాచారం. పోలీసులు అనధికార అనుమతులు ఇవ్వడంతో జోరుగా సాగాయి. ఈ పందేల్లో పొలిటికల్ లీడర్లు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనడం కొసమెరుపు. ఈ విషయం మీడియా ద్వారా బయటకు రావడంతో ఎస్ఐ రఘునాథరావు, సిబ్బందితో కలిసి శనివారం తెల్లవారు జామున కోడి పందేలపై దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. వారి నుంచి రెండు కోళ్ళు, రూ.40,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ చెప్పారు.

200 కోడి కత్తుల స్వాధీనం

ప్రజాశక్తి - గోకవరం

కామరాజుపేట, కొత్తపల్లి గ్రామాల్లో కోడి కత్తులు తయారు చేస్తున్న వారిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి 200 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన చేదులూరి వీరబాబు, సూరంపూడి కోటేశ్వరరావు, కామరాజుపేటకు చెందిన వేములూరి నాగేశ్వరరావును అదుపులోనికి తీసుకున్నట్లు సిఐ ఎస్‌వివిఎస్.మూర్తి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు విఎన్‌వి.పవన్ కుమార్, బి.నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

6 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - గోకవరం

ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సారా అమ్ముతున్న ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకుని, అతని వద్ద నుండి 6 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. అతడిని రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రొఫెసర్ శర్మను సత్కరిస్తున్న డైరెక్టర్ నాయుడు

సముద్ర జీవవైవిధ్యంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ

ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల మత్స్య, ఆక్వాకల్చర్ విభాగాల ఆధ్వర్యంలో 'సముద్ర జీవ వైవిధ్యం-సముద్ర జల నాణ్యత-సముద్ర జీవులపై ప్రభావం' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ నిట్టాల ఎస్.శర్మ పాల్గొని మాట్లాడారు. సముద్ర జల నాణ్యతలో మార్పులు, సముద్ర జీవుల ఆరోగ్యం వంటి అంశాలు ఆక్వాకల్చర్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. నీటి ఉష్ణోగ్రత, లవణీయత, ద్రవీభవించిన ఆక్సిజన్ వంటి అంశాలు కీలకమని తెలిపారు. విద్యార్థులు పరిశోధన అనుభవం పొందాలని, క్షేత్రస్థాయి అధ్యయనాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని మత్స్య, ఆక్వాకల్చర్ విభాగాధిపతి డాక్టర్ కెవిఎన్.మూర్తి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఫిషరీస్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - ఆలమూరు

పెనికేరు లో ఏకీకృత కుటుంబ సర్వేను డిప్యూటీ ఎంపిడిఒ ఎస్.వీరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా సచివాలయ సిబ్బంది ప్రతీ కుటుంబం యొక్క నాలుగు అంశాలపై వివరాలు నమోదు చేస్తారన్నారు. అవి ప్రాథమిక, సామాజిక, ఆర్థిక, పురోగతి వివరాలను సర్వే యాప్‌లో నమోదు చేసి భవిష్యత్తు పథకాలకు ఈ సమాచారం అందజేయనున్నారు. ఈ సర్వే వల్ల అర్హులకు ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్ల జారీ సులభతరం, పారదర్శకత పాలన అందుబాటు, ప్రోయాక్టివ్ సర్వీస్, డేటా భద్రత ఉంటుందన్నారు. సిబ్బం ది వచ్చినప్పుడు మీ ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ ఒటిపి కోసం సిద్ధంగా ఉంచుకో వాలన్నారు. ఈ ఏకీకృత సర్వే ద్వారా ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రారంభిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వై.అయ్యన్న, వివిధ శాఖల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - అంబాజీపేట

ప్రభుత్వం ప్రబల తీర్థాలు ప్రత్యేక పండగగా గుర్తించిన నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు అసౌకర్యం కలగకుండా పరిసరాలు పరిశుభ్రతకి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎంపిడిఒ బి.మమత అన్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రభల తీర్థాలు నిర్వహించే మొసలపల్లి, ఇరుసుమండ, జగ్గన్నతోట ప్రాంతాలలో ప్రత్యేక శానిటేషన్ పనులను ఎంపిడిఒ బి.మమత, డిప్యూటీ సచివాలయ ఎంపిడిఒ (జిఎస్‌డబ్ల్యూఎస్) ఎండి. అబ్బాస్‌అలీలు శనివారం పరిశీలించారు. డిప్యూటీ ఎంపిడిఒ మాట్లాడుతూ సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణ కల్పించేలా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు.

కూటమి పార్టీలకు కేంద్రం చురక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి పార్టీలకు కేంద్రం చురకలు వేసిందా అంటే ఔననే సమాధానం వినిపిస్తోంది. బిజెపి సర్కారు ఉపాధి చట్టాన్ని తాజాగా రద్దు చేసిన విషయం విదితమే. ఈ స్థానంలో బివిరామ్‌జీ పథకాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో మెటీరియల్ కాంపోనెంట్ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అధిక శాతం అప్పజెప్పింది. రాష్ట్ర విభజన, అనంతరం జిల్లాల పునర్విభజనల నేపథ్యంలో అభివృద్ధి అగమ్యగోచరంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కల్పించలేని దుస్థితిలో పాలన సాగుతోంది. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గడిచిన 18 నెలలో సాధించిన అభివృద్ధి మేడిపండు చందంగా మారింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెపండుగ పరిస్థితి అగమ్య గోచరంగా మారనుంది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలు ఉపాధి పథకంలోనే జరుగుతున్నాయి. కేంద్రం నిర్ణయంతో ప్రస్తుతం ఈ భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడనుంది. మరోవైపు కరోనా నేపథ్యంలో విధించిన లాక్‌డౌన్ కాలంలో ఉపాధి పనులే గ్రామీణులకు ఆసరాగా నిలిచాయి. ఇప్పటికీ పల్లెల్లో ఉపాధి పనులు అత్యధిక మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రజల ఉపాధి కల్పనకు, అభివృద్ధి పనులకు శరాఘాతంగా మారినా ప్రశ్నించలేదని దుస్థితిలో టిడిపి, జనసేన పార్టీల నేతలు ఉన్నారనేది మరో సారి సుస్పష్టమైతంది. ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకుని రాష్ట్ర ప్రయోజనాలకోసం కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

కార్మికుల పండుగకు సమాయత్తం

విశాఖపట్నంలో జరగబోయే సిఐటియు అఖిలభారత మహాసభలకు ఉమ్మడి జిల్లాల నుంచి తరలి వెళ్లేందుకు కార్మికులు సమాయత్తం అవుతున్నారు. జిల్లాలో అత్యధిక మంది వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతో పాటు పట్టణాలలో వివిధ వాణిజ్య, వ్యాపార రంగాలలో ఉపాధి పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను అమలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి పనిగంటలలో మార్పులు తీసుకొచ్చింది. మరో వైపు స్కీము వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఇప్పటికే ఆందోళన బాట పట్టారు. తమ సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలే దిక్సూచి అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో విశాఖలో జరిగే మహాసభ భవిష్యత్తు పోరాటాలకు దశ, దిశ నిర్దేశం చేస్తుందని సుస్పష్టం అవుతోంది. దీంతో వేలాదిగా తరలి వెళ్లి పాలక ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిద్ధమవుతున్నారు.

అబ్బుర పర్చిన సైన్స్ సంబరాలు

చిన్నారులలో సృజనాత్మకత వెలికితీసేందుకు నిర్వహించిన ఆవిష్కరణలు అబ్బుర పరిచాయి. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా కేంద్రమైన కాకినాడ వేదికైంది. సత్యసాయి గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు రాజమహేంద్రవరంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. వైజ్ఞానిక ప్రదర్శనలతో పాటు ఇతర వ్యాస రచన, ఆర్ట్ కాంపిటిషన్‌లలోనూ



ఆసక్తి చూపారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి నిర్వహకులు వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభావేదికపై వ్యక్తల ప్రసంగాలు విద్యార్థులను ఆలోచింపచేశాయి. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండటంతో పాటు శాస్త్రీత ఆలోచనలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలనే ఆకాంక్షించారు

ఎట్టకేలకు టిడిపి అధ్యక్షుల ఎంపిక

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ ఎట్టకేలకు ముగిసిన విషయం విదితమే. తాజా నిర్ణయంతో అశావహుల్లో కొంత నిరాశ వ్యక్తమైంది. పార్టీ కార్యాలయాలను నెలకొల్పేందుకు కృషి జరగాలని మంత్రి నారా లోకేష్ సూచించారు. సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీకి సొంత కార్యాలయాలు లేవు. ప్రజా ప్రతినిధుల కార్యాయాలే పార్టీ కార్యాలయాలుగా ఉన్నాయి. తాజా నిర్ణయంతో స్థలాల ఎంపిక జరగనుందని సుస్పష్టం. గత ప్రభుత్వ హయాంలో వైసిపి ప్రభుత్వ స్థలాల్లో పార్టీ కార్యాలయాలు నెలకొల్పేందుకు చేసిన ప్రయత్నం విమర్శలకు దారి తీసిన విషయ విదితమే. ఈ అనుభవంతో టిడిపి ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

యానాం వార్తలు



పరికరం పై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

మత్స్యకారులకు అవగాహన

ప్రజాశక్తి - యానాం

యానాం మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దడాల గొంతియ్య ఆధ్వర్యంలో సావిత్రినగర్ ఫిషింగ్ జెట్టీ వద్ద మత్స్యకారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సముద్రంలో వేటకు వెళ్లిన తర్వాత సునామీ, తుపానులు వంటి విపత్కర పరిస్థితుల్లో ఉపయోగపడే ట్రాన్సుసౌండర్ పరికరం యొక్క ఉపయోగాలను బెంగళూరుకు చెందిన అకౌంట్ అండ్ అకార్ట కంపెని సాంకేతిక నిపుణులు అక్బర్, హర్ష అవగాహన కల్పించారు. మెకనైజ్డ్ బోట్ల యజమానులకు పరికరం పనిచేసే విధానాన్ని వివరించారు. ప్రత్యేకమైన బ్యాటరీతో పనిచేసే ఈ పరికరాన్ని రూ.3,500కే రాయితీపై ప్రభుత్వ ఇస్తుందన్నారు. సెల్‌ఫోన్‌కు సాంకేతికతను అనుసంధానం చేసిన తరువాత దాని పని తీరుపై వివరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, అధికారులు పాల్గొన్నారు.

ఆక్వాటిక్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 29 వరకు హైదరాబాద్‌లో నిర్వహించబోయే 36వ సౌత్ జోన్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ ఈత పోటీలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) నుంచి ఈత క్రీడాకారులు ఎంపికైనట్లు సెంటర్ ఇన్‌ఛార్జ్ ఎన్.ఉదయ్‌కుమార్ శనివారం తెలిపారు. బాలుర విభాగంలో కె.సతీష్‌కుమార్, పి.నిశాంత్, ఎన్.అభిశిక్త్, బాలికల విభాగంలో ఎం.ప్రవళిక, ఎం.వల్లికశ్రీజ పాల్గొంటారని తెలిపారు. వీరికి గ్రంధి రవితేజ కోచ్‌గా వ్యవహరిస్తారన్నారు.

ఆదిత్యలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య విద్యా సంస్థకు చెందిన మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం గ్రాడ్యుయేషన్ డేని నిర్వహించారు. బిబిఎ, ఎంబిఎ(ఇంటిగ్రేటెడ్), ఎంబిఎ 2023, 2024, 2025 విద్యా సంవత్సరాల్లో చదువును పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఒఎన్‌జిసి మాజీ చీఫ్ జిఎం డాక్టర్ పిఆర్‌కె.రాజు మాట్లాడారు. కళాశాలలో చదువుకున్న రోజులు గడిపిన స్నేహ బాంధవ్యాలు, ఉపాధ్యాయులతో మనం నడుచుకునే విధానం ఇవి అన్నీ మన జీవిత కాలంలో మధురానుభవంగా మిగిలిపోతాయని అన్నారు. ఇప్పటి వరకు గడిచిన జీవితం వేరు రాబోవు రోజుల్లో జీవితం పట్ల బాధ్యత మనకంటూ ఒక గుర్తింపు కోసం వేరు వేరు దారిలో ప్రయాణం చేయడంతో వివిధ రంగాలలో మనం స్థిర పడవలసి వస్తుందన్నారు. మనం నేర్చుకున్న విజ్ఞానం జీవితానికి అన్వయించుకొని బంగారు భవిష్యత్‌కు బాటలు చేసుకోవాలని



గ్రాడ్యుయేషన్ డేలో అధ్యాపకులు, విద్యార్థులు

సూచించారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో చదువు పూర్తి చేసిన విద్యార్థులకు మంచి భవిష్యత్ కోసం కృషి చేస్తున్నామని అన్నారు. డీన్ రవితంగజన్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సౌజన్య, ప్రో ఎం.గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ కమెరా షేక్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ఆటపాటలతో సాంప్రదాయ నృత్యాలతో కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

యాచకులు, పేదలకు పిఎంపి అసోసియేషన్ సభ్యులు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. పిఎంపి దినోత్సవాన్ని పురస్కరించుకుని జగ్గంపేట, గండేపల్లి మండలాల సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎస్ఎన్.భాషా, గౌరవ అధ్యక్షులు టిఎన్.మూర్తి, మండల ప్రధాన కార్యదర్శి జి.బాబ్జి, డి.మారుతి, రాధాకృష్ణ, దువ్వూరి శ్రీనివాస్, కె.కృష్ణ, రాఘవ, ఎస్‌కె.ఒలీషా, రామవరం గణేష్, రామ్మూర్తి పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు బీచ్ క్లీనింగ్

ప్రజాశక్తి - తాళ్లరేవు

వన్యప్రాణుల సంరక్షణకు శనివారం ఫారెస్ట్ అధికారులు ఆల్ ఈజ్ వెల్ బృందం బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హోప్ ఐలాండ్‌లోని పుత్తరయ్య పాకలు, తాబేళ్ల సంరక్షణ కేంద్ర వద్ద ఉన్న పరిసరాలను శుభ్రం చేసి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు ఎస్.వీరభద్రరావు, సిద్ధార్థ, కె.ధనుంజయ్, మహేష్, జగదీష్, పలువురు ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని కండరాడ జడ్‌పి హైస్కూల్‌లో ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం గంగాధర్ అధ్యక్షతన బాల్య వివాహలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం జిల్లా కౌన్సిలర్ బి.దుర్గారాణి, మండల లీగల్ సర్వీస్ అథారిటీ ప్యానెల్ న్యాయవాదులు ఎ.గీతా, కె.సత్యవేణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వాలంటీర్ ఎంవి.సూరిబాబు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పెదపూడి

మత్స్య సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పెదపూడి గ్రామానికి చెందిన కె.రామకృష్ణకు పిఎంఎంఎస్‌ఐ ద్వారా 40శాతం రాయితీపై రూ.3.12లక్షల విలువగల మూడు చక్రాల ఆటో, ఐస్ బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ పుట్టా గంగాధర్‌చౌదరి, మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎం.లావణ్య, వేట్లపాలెం మత్స్య అభివృద్ధి అధికారి ఆర్.నూకరాజు, ఎంపిడిఒ కె.నరేంద్ర రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



ధీరుబాయ్ అంబానీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

మానసిక వైకల్యాన్ని అధిగమించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

వికలాంగులు మానసిక వైకల్యం అధిగమించి పురోగతి సాధించాలని తహశీల్దార్ త్రినాథరావు సూచించారు. శనివారం మండలంలోని సీతారామపురంలో ఉన్న ధీరుబాయ్ అంబానీ ఎర్లీ ఇంటర్వెన్షన్ కేంద్రం ఇన్‌ఛార్జ్ గోపాల్ ఆధ్వర్యంలో 17వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ధీరూబాయ్ అంబానీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వికలాంగ చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రిలయన్స్ సహకారంతో ఉమా మనోవికాస్ కేంద్రం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఫిజియోథెరపీ వైద్యులు శ్రీకాంత్ చేస్తున్న వైద్య సేవలను ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయురాలు ఉదయకుమారి, సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు శనివారం సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్, వెల్ఫేర్ స్కీమ్స్‌పై శిక్షణ ఇచ్చారు. వాష్, సాహస స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో ఫీల్డ్ స్థాయి సామర్థ్యాలను పెంచడం, ఉద్యోగంలో భద్రతను మెరుగుపరచడం, శానిటేషన్, వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ పద్ధతులను బలోపేతం చేయడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షితంగా బరువులు ఎత్తటం, ప్రథమ చికిత్స, రసాయనాల వల్ల కలిగే ప్రమాదాల నివారణ వంటి ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఈ శిక్షణకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ నోడల్ అధికారిగా వ్యవహరించారు. శిక్షణ తరగతుల ముగింపు సభలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొని కార్మికులకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు.

రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - పిఠాపురం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి బల్లా సింహచలం మెమోరియల్ సబ్ జూనియర్ బాలబాలికల రగ్బీ పోటీలు జరిగాయి. స్థానిక ఆర్ఆర్‌బిహెచ్‌ఆర్ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 180 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలలో బాలికల విభాగంలో మొదటి స్థానం గురజానపల్లి, రెండో స్థానంలో పిఠాపురం, మూడో స్థానంలో తుని క్రీడాకారులు నిలిచారు. బాలుర విభాగంలో మొదటి స్థానం గురజానపల్లి, రెండో స్థానంలో రామచంద్రపురం, మూడో స్థానంలో కొమరగిరి క్రీడాకారులు నిలిచారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ రగ్బీ బాలబాలికల పోటీలకు 12 మంది బాలురు, 12 మంది బాలికలు మొత్తం 24 మంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 29వ తేదీన కర్నూల్‌లో



క్రీడాకారులతో అసోసోయేషన్ ప్రతినిధులు

జరుగుతున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో వీరు పాల్గొంటారని జిల్లా రగ్బీ కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఛైర్మన్ వియ్యపు రామన్నరాజు, అధ్యక్షులు పి.దొరబాబు, కె.నాగలింగేశ్వరరావు, శేషుకుమారి, బోడ సతీష్, ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, లిటిల్ సోల్జర్స్ స్కూల్ కరస్పాండెంట్ ఎన్.మహేంద్రన్ విజేతలకు బహుమతులు అందజేశారు.

వసతుల కల్పనకు దాతలు సహకరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనకు దాతలు సహకరించాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులకు కనీస వసతులు కల్పించే కార్యక్రమానికి దాతలు, వితరణ శీలురు, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక వేత్తలు, అధికారులు, ప్రజలు ధన, వస్తు రూపంలో ఉదారంగా ముందుకు రావాలన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న 100 సంక్షేమ హాస్టళ్లలో దాదాపు 15 వేల మంది పేద వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారని, వీరందరికి మంచి విద్య, ఆరోగ్యం, బంగారు భవిత అందించేందుకు ఈ హాస్టళ్లలో కనీస వసతుల అభివృద్ధి చేపడుతున్నామన్నారు. సదాశయంతో చేపట్టిన ఈ సంకల్పానికి తమ వంతు సహాయంగా విరాళాలు అందించేందుకు దాతలు ముందుకు రావా లని కలెక్టర్ కోరారు. నూతన సంవత్సర వేళ జిల్లా కలెక్టరుకు శుభాకాంక్షలు తెలియజేసే వారు విరాళాలను ధన రూపం లో గాని, దోమ తెరలు, ఆర్‌ఒ ప్లాంటులు, మోడ్రన్ లైబ్రరీ తదితర వస్తు రూపంలో గాని అందజేయవచ్చునని తెలిపారు. అలాగే విరాళాలను కలెక్టర్ యుపిఐ ఐడి: 79296001 @ubin, QR Code, చెక్కు, డిమాండు డ్రాఫ్ట్ ద్వారా గాని లేదా కలెక్టర్ అకౌంట్ నెంబర్ 144012010000923, IFSC:UBIN 0814407, Union Bank of India, Collectorate Branch అకౌంటుకు నగదు బదిలీ ద్వారా చెల్లిం చాలని కోరారు. పేద విద్యార్థుల జీవితాల ను ఉజ్వలంగా తీర్చిదిద్దే ఈ ఉదాత్త కార్య క్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వల్లభునికి రూ.2.04 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.2.04 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.1,20,860, అన్నదాన విరాళాల ద్వారా రూ.61,519, కేశఖండన ద్వారా రూ.3,000, తులాభారం ద్వారా రూ.300, లడ్డు ప్రసాదం ద్వారా రూ.19,035 వెరసి రూ.2,04,714 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, ఆలయ ఛైర్మన్ మొయిళ్ళ సంధ్య, ధర్మకర్తలు, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్ర, అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

పాత్రికేయుడు పూడా వెంకటరమణ భార్య హిమావతి ప్రథమ వర్ధంతి సందర్భంగా తోటపేటలో పేదలకు వస్త్ర, అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఒకరోజు ముందే పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో ఈనెల 31వ తేదీనే పింఛన్ల పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపిడిఒ కె.హరికృష్ణసత్యారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 జనవరి ఒకటో తేదీ కావడంతో ఒకరోజు ముందే పెన్షన్లు పంపిణీ చేస్తామన్నారు. అందుబాటులో లేని వారికి జనవరి రెండో తేదీన పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. కావున లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి అందుబాటులో ఉండాలన్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న వైస్ ఛైర్మన్ సాయిప్రసాద్

సంపూర్ణ పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక 12, 24 వార్డులలో శనివారం సంపూర్ణ పారిశుధ్య పనులు నిర్వహించారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పనులను మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ పరిశీలించారు. వీధులను పరిశుభ్రం చేయటమే కాకుండా పిచ్చి మొక్కలు, చెత్తగుట్టలు తొలగించారు. అన్ని డ్రెయిన్లను పరిశుభ్రం చేసి పూడికను తొలగించారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ సాయిప్రసాద్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో అన్ని వార్డులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొట్టి పవన్‌కుమార్, వైసిపి నాయకులు పేరిశెట్టి మత్యుంజయరావు, ఇతర వైసిపి నాయకులు పాల్గొన్నారు.